టీటీడీ చైర్మన్‌గా బి.ఆర్.నాయుడు ప్రమాణ స్వీకారం

తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి చైర్మన్‌గా బి.ఆర్.నాయుడు బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా క్షేత్ర సాంప్రదాయం పాటిస్తూ బి.ఆర్.నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ భూ వరహాస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి ఆలయానికి విచ్చేశారు. ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ అధికారులు బి.ఆర్. నాయుడుకు స్వాగతం పలికారు. ఆలయంలో బంగారు వాకిలి వద్ద టీటీడీ ఈవో జె.శ్యామలరావు బి.ఆర్.నాయుడుతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకోగా రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేశారు.

వార్త మెయిన్‌లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

గురువారం 07 నవంబరు 2024 | 8 పేజీలు

మహిళలకు రక్షణ ఎక్కడ ?

- ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల

వార్త మెయిన్‌లో

కార్మిక కర్షక ఐక్యతను కూడగడదాం ... మోడీకి మంట పెడదాం

కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక రైతు సంఘాల సమన్వయ సమితి సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు బైరాగి పట్టెడలో గల గంధమనేని శివయ్య భవన్‌లో సన్నాహక సమావేశం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు అధ్యక్షతన జరిగింది. నవంబర్ 26 రాజ్యాంగ హక్కుల దినం నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక హక్కులు హరించబడుతున్నాయి. పేదలకు రక్షణ లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి . కార్మిక హక్కులు కాలరాయపడుతున్నాయి. లేబర్ కోడ్‌లు తెచ్చి పెట్టుబడిదారులకు లాభాలు వచ్చే విధంగా తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మే ప్రయత్నం చేస్తున్నారు.

వార్త మెయిన్‌లో

వృద్ధాశ్రమంపై శ్రద్ధ ఏది..?

- ఉద్యోగుల జీతాలు పక్కదారి

పూర్తి స్థాయిలో లేని ఉద్యోగులు - ఐసిడిఎస్ నిర్లక్ష్యమే కారణమా

- ఏడుగురు వృద్ధులతో సరిపెట్టుకున్న వైనం

- చిత్తూరు జిల్లా కేంద్రంలో దుస్థితి

విశాలాంధ్ర - వెదురుకుప్పం: ఆభాగ్యులకు కష్టాలు,కన్నీళ్లు మరిపించే ఆనంద నిలయం గా ప్రభుత్వం నెలకొల్పిన వృద్ధాశ్రమం పై అధికార యంత్రాంగానికి శ్రద్ధ కరువైంది. బతుకు భారం తో చారమాంకం లో దిక్కుమొక్కు లేని మహిళల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన విడిది విధివంచితులకు అనుకున్న మేర బాసటగా లేకపో యిందని అక్కడి పరిస్థితులు అద్దం పడుతున్నాయి. మానవతా దృక్పథం పెల్లుబికి ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమం నిర్వహణ గాలికొదిలేశారనే విమర్శలు వచ్చిపడుతున్నాయి.

2లో

గ్రామాల్లో కక్ష సాధింపు చర్యలు చేపడితే

చర్యలు తప్పవు

పంటను నాశనం చేసిన వారిపై కేసు నమోదు

- ఎస్ఐ అజయ్‌కుమార్

.... వార్త 2లో ....

తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే

మా ప్రాధాన్యత

- భక్తులు సేవకు సమిష్టి కృషి చేయాలి
- అవాంతరాలు లేకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించిన అధికారులకు అభినందనలు
- టీటీడీ నూతన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బి.ఆర్.నాయుడు

2లో

చర్యలు తప్పవు

విశాలాంధ్ర-దొరవారిసత్రం:

దొరవారిసత్రం మండల పరిధిలోని బూదూరు గ్రామంలో 'మాడిన పంట కడుపు మంట' అనే వార్త ఆదివారం 'విశాలాంధ్ర' జాతీయ దినప్రతికలో ప్రచురితమైన విషయం తెలిసిందే. మండలంలోని బూదూరు గ్రామానికి చెందిన సట్టు వరలక్ష్మి తన 0.69 సెంట్లు భూమిలో వరి పంట వేసి ఉంటే అదే గ్రామానికి చెందిన చేరెడ్డి జగనాధం రెడ్డి పాత కక్షలతో గడ్డి నివారణ ముందును అతని అనుచరులతో కలసి పంటకు కొట్టి పంటను చంపేశాడని ఆమె పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం ఎస్ఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎవరు కూడా వ్యక్తిగత కక్షలతో ఆస్తులను నాశనం చేసుకోకండి అని, మీకు ఎమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజే యాలన్నారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలు చేస్తే కఠినమైన చర్యలు తప్ప వని హెచ్చరించారు. అదే విధంగా వ్యవసాయాధికారులు పంట పొలంలోకి వచ్చి వరి పంటకు గ్లైజల్ పిచికారి చేసినట్లు గుర్తించారు. అనంతరం ఆ పంట పొలంలోని మట్టిని, మాడిన పైరును పరీక్ష నిమిత్తం తిరుపతి వ్యవసాయ పరిశోధన కేంద్రానికి తరలించారు.

వృద్ధాశ్రమంపై శ్రద్ధ ఏది..?

(మొదటి పేజీ తరువాయి) నిజానికి జిల్లా కేంద్రంలో పార్లమెంట్ సభ్యులు,జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల నివాసాలకు కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ వృద్ధాశ్రమం పై దృష్టి సారించలేకపోవడం విశేషం. వివరాల లోకి వెళితే...జిల్లా కేంద్రం లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని1978 లో అప్పటి జిల్లా కలెక్టర్ రాజాజీ ప్రారంభించారు.1980 సంవత్సరం నుంచి పక్కా భవనం ఏర్పాటు చేసి 30 మంది వృద్ధ మహిళలకు ఆశ్రమం కల్పించేవిదంగా వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు. కొద్ది కాలానికి వీటి నిర్వహణ బాధ్యతలు ఐసిడిఎస్ కు అప్పగించింది.ప్రస్తుతానికి 7మంది వృద్ధులు మాత్రమే ఆశ్రయం పొందుతున్నారు.ఆశ్రమ నిర్వహణ కోసం పనిచేయాల్సిన ఉద్యోగుల సరిపడా లేకపోవడం ముగ్గురే విధులు నిర్వహించాల్సి రావడం తో నిర్వహణ కష్టతరంగా మారినట్లు తెలుస్తోంది.సుమారు 70 సంవత్సరాల వృద్ధురాలు నాలుగు వేల జీతానికి వంటమనిషి,రాత్రి వాచ్ మేన్ ఉద్యోగాలు చేస్తూ బతుకులీడిస్తూ ఉంది అంటే ఆశ్రమ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఇలా మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు పనిభారం ఎక్కువైనా భరించి ఉద్యోగం చేస్తున్న అక్కడ సిబ్బంది జీతం పక్కదారి పట్టినట్లు తెలిసింది.గతంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు లో ఓ అధికారి వ్యవహారం నడిపించినట్లు సమాచారం.వృద్ధాశ్రమం పనితీరు బాగోగుల గురించి పట్టించుకో కపోవడంతో లక్ష్యం నీరుగారుతోన్న విమర్శలు ఉన్నాయి.కీలకమైన ప్రజా ప్రతినిధుల నివాసాల వద్ద విలపిస్తున్న వృద్ధుల సంక్షేమం పై ప్రజా నాయకులు, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు సామాజ సేవకులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఇదే విషయమై ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి వివరణ కోరగా ఇటీవలే బాధ్యతలు చేపట్టామని,వృద్ధాశ్రమం లో సిబ్బందికి 7 నెలలుగా జీతాలు రాలేదని పిర్యాదు వచ్చిందన్నారు.ఉద్యోగుల జీతాలు,నిధుల పక్కదారి విషయమై తమకు తెలియదని చెప్పారు.పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని వివరించారు.

మా ప్రాధాన్యత

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్:

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ప్రాధాన్యత అని టీటీడీ నూతన ధర్మకర్తల మండలి చైర్మన్ బి.ఆర్. నాయుడు తెలియజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం బుధవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన తొలిసారిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్నప్పటి నుండే ప్రతి సంవత్సరం శ్రీవేంకటేశ్వర స్వామిని కాలినడకన వచ్చి దర్శించుకునేవాడినని, ప్రస్తుతం తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవ చేసుకునే అరుదైన అవకాశాన్ని శ్రీవారు ప్రసాదించడం పూర్వజన్మ సుకృతమన్నారు. భక్తులకు సేవ చేసేందుకు మీడియాతో సహా ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత నెలలో బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అధికారులు సమిష్టి కృషిని కొనసాగించాలని ఆకాంక్షించారు. అంతకుముందు టీటీడీ సీనియర్ అధికారులందరితో చైర్మన్ పరిచయ సమావేశం నిర్వహించారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు టీటీడీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సమర్పించారు. తిరుమల ఆలయం, స్థానిక దేవాలయాలు, అన్నప్రసాదం, విజిలెన్స్, ఆరోగ్యం, రవాణా, ఐటి, గోశాల, ఉద్యానవనం, అటవీ శాఖ, విద్యాసంస్థలు ప్రాముఖ్యతను వివరించారు. ఆసుపత్రులు, మెడికల్, పిఆర్ వింగ్, రిసెప్షన్, కళ్యాణకట్ట, హిందూ ధార్మిక ప్రాజెక్టులు, యాత్రికుల దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలను చూసుకోవడంతో పాటు తమ నిబద్ధతతో సంస్థ ఖ్యాతిని అన్ని స్థాయిలలో ముందుకు తీసుకెళ్లడంలో ఉద్యోగులు అంకితభావంతో ఉన్నారని ఈవో తెలిపారు.ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిఎల్ఓ వరప్రసాదరావు, సిఈ సత్యనారాయణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిర్దేశించిన పనులను త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - చిత్తూరు : జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని, 2024-25 సంవత్సరానికి మంజూరు కాబడ్డ అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పరీక్షించాలని, పూర్తి అయిన పనులకు సంబంధించిన బిల్లులను సత్వరమే అప్ లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పంచాయతీరాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరంలో జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-25 కింద చేపట్టిన పనుల పురోగతి పై పంచాయతీ రాజ్, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమం లో డ్వామా పి.డి. రవికుమార్, పి ఆర్ డిఇ లు, ఏఇ లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రోడ్ల కు సంబంధించి 2024-25 సంవత్సరానికి గానూ 1503 పనులు మంజూరు కాబడ్డాయని, ఇందులో రూ.13 కోట్లతో 248 పనులు పూర్తి చేశామని, రూ.8 కోట్లకు సంబంధించిన బిల్లులను అప్ లోడ్ చేసి రూ.2.50 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను సత్వరం ఆన్లైన్ లో అప్ లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సిసి రోడ్డు నిర్మాణం జరిగే సమయంలో పంచాయతీ రాజ్ ఇంజినీర్లు నాణ్యతను పరీక్షిస్తుండాలని, నాణ్యతాపరంగా ఖచ్చితంగా ఉండాలన్నారు. ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ కింద చేపట్టే ఇతర పనులను విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలు పంపాలన్నారు. ఐసిడిఎస్ అధికారు లతో సమన్వయం చేసుకుని అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాల నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. సిసి రోడ్ ల నిర్మాణంలో వెనుకబడిన మండలాలు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

జిల్లాలో మహిళాభివృద్ధి,

శిశు సంక్షేమ శాఖ అధికారులు కిషోర్ వికాస్ పథకాన్ని

పటిష్టంగా అమలుచేయాలి

*పోషకాహారలోపం నివారణకు ప్రత్యేక శ్రద్ధచూపాలి: **కలెక్టర్***

విశాలాంధ్ర - తిరుపతి : జిల్లాలో మహిళ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు కిషోర్ వికాస్ పథకం అమలు, పోషకాహార లోపం నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులకు సూచించారు.బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖపై సిడిపిఓ లు, సూపర్వైజర్లు తదితరులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు కిషోర్ వికాస్ పథకం అమలు పోషకాహార లోపం సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్వాడి పనితీరు, అందే సేవలతో పాటు బాలికల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ చూపాడం తో పాటు బాలికల మీద జరుగుతున్న అత్యాచారాలు, వాటిని నుండి బాలికలు ఎదుర్కొని మార్గాల గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాల్య వివాహాల నివారణ దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బాల్య వివాహాల జరగడం వలన ఆడ పిల్లలు భవిష్యత్తులో ఎదుర్కొనే సమస్యల గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లల పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలని, సంబంధిత అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు సమాచారమును సంబంధిత అధికారులకి చేరవేయాలని, సంబంధిత శాఖలు పిల్లల పట్ల త్వరిత గతిన స్పందించి వారి రక్షణ సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారుపిల్లలు, బాలింతలు, గర్భవతులకు పోషకాహార లోపం నివారణ దిశగా గుడ్లు సక్రమంగా అందేలా నాణ్యతగా ఉండేలా పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని సిడిపిఓలు సూపర్వైజర్లకు ఆదేశించారు. పోషణ ట్రాక్ యాప్ ద్వారా అంగన్వాడి పిల్లల వివరాలను కచ్చితంగా నమోదు చేసేలా చూడాలనితెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, డిసిపిఓ శివ శంకర్, సిడిపిఓలు, సూపర్వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్ధులకు అవగాహన కలిగించారు. హైద్రా బాద్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ ఎక్స్ పర్ట్ నరసింహారావు పాల్గొని విద్యార్ధులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.అనంతరం డీ.ఎస్పీ వీవీ రమణ కుమార్ మాట్లాడుతూసైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతు న్నాయని తెలిపారు.దీన్ని దృష్టి లో ఉంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.మొబైల్స్ మెసేజ్ ల ద్వారాను,ఆన్ లైన్ ద్వారాను ఈ నేరాలు జరుగుతున్నాయని తెలిపారు.చాలామంది నగదు పోగొట్టుకున్నారని, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్, గూడూరు,వాకాడు సీఐలు కిషోర్‌బాబు,శేఖర్ బాబు,ఎస్ఐలు, ఎ.వో కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నూరులో నిరుపయోగంగా

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం

విశాలాంధ్ర - కార్వేటినగరం : దాదాపు ఐదు సంవత్సరాలుగా మండల పరిధిలోని అన్నూరు గ్రామంలో నిరుపయోగముగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంగం భవనం ఉంది. దీని గురించి అటు వ్యవసాయ సహకార సంఘం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఎందుకు ఇదే నిదర్శనం. ప్రభుత్వం భవనాన్ని ఏదో విధంగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది. అయితే అధికారులు ఈ భవనం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల ప్రభుత్వం అని చెప్పుకునే కూటమి ప్రభుత్వం అయినా ఈ భవనాన్ని పరిశీలించి ఉపయోగపడేలా చూడాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై ఉంది. దీని గురించి జిల్లా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న భవనాన్ని రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం.

శ్రీవారి సేవలో

చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ

విశాలాంధ్ర - తిరుపతి : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సేవలో తరించారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం చిత్తూరు ఎంపీకి తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచన అందించగా, అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందించారు.అంతకు ముందు తిరుమల తిరుపతి దేవస్థానం 54వ పాలకమండలి అధ్యక్షులుగా నియమితులైన బి. రాజగోపాల నాయుడి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు హాజరయ్యారు. తిరుమల శ్రీవారి సన్నిధిలో నూతన టిటిడి చైర్మన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మీడియాతో మాట్లాడారు. టిటిడి సమర్ధవంతంగా పనిచేయడం వల్లే శ్రీవారి భక్తులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయని అన్నారు. కొత్తగా నియమితులైన టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు నేతృత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఖ్యాతిని మరింతగా ఇనుమడింప చేయగలరనీ ఆయన అభిప్రాయపడ్డారు.

పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు సోమవారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు 30 మందికి పౌష్టికా హారాన్ని మీదుగా పంపిణీచేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యకులు కడి వేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని అనే కార్యక్ర మం ద్వారా డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారాలతో నిర్వహిస్తున్న మన్నా రు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మధు , శ్రీనివాసులు, మురళీ నాయుడు , శ్యామ్, కోట వెంకటే శ్వర్లు , నాగరాజు , కృష్ణ రెడ్డి,శ్రవణ్,సాయి తదితరులు పాల్గొన్నారు.

మా ఆస్తులను విఆర్ఓ బారి నుండి కాపాడండి

విశాలాంధ్ర - పుంగనూరు: పట్టణంలోని తూర్పు పాలెం కు చెందిన మహిళలు తమ ఆస్తులను విఆర్ఓ భారీ నుండి కాపాడాలని కోరుతూ బుధవారం రోజున తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి నినాదాలు చేయడం జరిగింది అనంతరం తాసిల్దార్ రాముకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా బాధిత మహిళలు మాట్లాడుతూ తమకు వారసత్వంగా వచ్చిన ఆస్తి పట్టణ సమీపంలోని నక్కబండ ప్రాంతంలో ఉన్నదన్నారు ఈ భూమిపై విఆర్ఓ వెంకట ముని కన్నేసి తమ ఆస్తులను లాక్కో వడం కొరకు తప్పుడు రికారులను సృష్టించి భూమి లోకి వచ్చి బెదిరించడం జరుగుతున్నది అన్నారు అందుకనే తమ ఆస్తులు తమకు ఇప్పించాలని కోరుతూ ధర్నా నిర్వహించామన్నారు ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయగలరని కోరుతున్నామన్నారు.

ఏలూరు కళ్యాణ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శిరసునంబేడు యూత్

విశాలాంధ్ర - పెళ్ళకూరు: మండలంలోని శిరసనంబేడు గ్రామం యువ నాయకుడైన ఏలూరు కళ్యాణ్ రెడ్డికి శిరసనంబేడు యూత్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈరోజు ఉదయం తిరుమల లో వెంకటేశ్వర స్వామి దైవ దర్శనం చేసుకొని నెల్లూరుకు వెళుతుండగా జాతీయ రహదారి 71 రోడ్డు అరవిందో అపార్ట్మెంట్ మార్గం వద్ద కళ్యాణ్ రెడ్డికి బాణ సంచనాలు కాల్చి, శాలువాలు కప్పి, పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని శిరసనంబేడు యూత్ వెంకటేశ్వర స్వామిని కోరుకున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సునీల్, శశి, నవీన్, మహేష్, వెంకటేష్, తేజ, రవి, కుమార్, నరసింహులు ,చెంచయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు పెద్దకనపర్తి విద్యార్థి

విశాలాంధ్ర-తొట్టంబేడు: విజయనగరం జిల్లాలో త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న జి.జ్ఞాన చరణ్ ఎంపిక య్యారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మంగళవారం జరిగిన అండర్ -14 జిల్లా స్థాయి పోటీల్లో జ్ఞాన చరణ్ విశేష ప్రతిభ కనబర చడంతో అతనిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన జ్ఞాన చరణ్‌ను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు సన్మానిం చడంతో పాటు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సుబ్ర హ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.చెంగల్రాయులు, ఉపాధ్యాయలు బాలాజీ, ఫౌజి యా, గోపాల్, మోతీలాల్, సరిత, జరీనా, విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కానూరులో 'పొలం పిలుస్తుంది' : ఏవో

విశాలాంధ్ర - పెళ్లకూరు: మండలంలోని కానూరు, తాల్వాయిపాడు గ్రామాలలో బుధవారం వ్యవసాయ అధికారి ప్రవీణ పొలం పిలుస్తుంది. కార్యక్రమాన్ని నిర్వహించారు. తాళాయపాడు గ్రామంలో జరుగుతున్న వరి నాట్లు పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏవో ప్రవీణ మాట్లాడుతూ సరైన సమయంలో వరి నాట్లును వేయాలని రైతులు పూర్తి చేయాల న్నారు. లేత పచ్చగా ఉన్న నారును మాత్రమే నాటుకోవాలని ముదురు నారు నాటితే దిగుబ డులు తగ్గుతాయని తక్కువ సమయంలో నాటినట్లయితే దిగుబడి వస్తుందని ప్రవీణా తెలియ జేశారు. కానూరులో నిమ్మ చెట్లకు కొమ్మ కత్తిరింపులు వచ్చినట్లయితే ఈవిధ పద్ధతుల గురించి వివరించడం జరిగింది. డ్రిప్, స్పంకర్లు పైన రాయితీ వివరాలు గురించి రైతులకు తెలియ జేశారు. మిరప నార్ల తెగులను కూడా ఏ విధంగా నివారించాలో తెలియజేస్తూ వాటి అధిక దేవుడు వచ్చేటట్లుగా రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగార్జున రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి శారద, శ్రీరాములు, రైతుల పాల్గొనడం జరిగింది.

తిరుపతి ప్రెస్‌క్లబ్ సొంత భవనానికి, జర్నలిస్టుల ఇంటి స్థలాలకు కట్టుబడి ఉన్నాం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

- ఘనంగా తిరుపతి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : తిరుపతి ప్రెస్ క్లబ్ సొంత భవనానికి, అలాగే జర్నలిస్టుల ఇంటి స్థలాలు మంజూరు చేసేందుకు కట్టుబడి ఉన్నామని తిరుపతి , చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్ స్పష్టం చేశారు. తిరుపతి తుడా కచ్చపి సమావేశ మందిరంలో బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తొలుత ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం చేత ఎన్నికల అధికారి బొమ్మల మురళి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఆర్ మురళి, కార్యదర్శిగా బాలచంద్ర, కోశాధికారిగా చంద్రబాబు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ముఖ్య అతిథులు ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి చిత్తూరు ఎంపీ ప్రసాద్, అలాగే తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, వేదిక్ యూనివర్సిటీ విసి రాణి సదాశివమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ జర్నలిస్టు సోదరులకు సొంత భవనం ఇవ్వడంతో పాటు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జర్నలిస్టు సోదరులు మాకు సహాయ సహకారాలు అందిస్తే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతిని రాకెట్ వేగంతో మరింత అభివృద్ధి చేసి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూటమి నేతల గొప్పతనాన్ని నలు దిశల చాటి చెబుతామన్నారు. అంతేకాకుండా గంజాయి మత్తు నుండి యువతను కాపాడుతా మన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ తిరుపతి పట్టణంలో జర్నలిస్టు సోదరులకు సొంత భవనానికి, ఇంటి స్థలాలకు స్థలాలు లేకుంటే చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో రూరల్ ప్రాంతంలో స్థలాలు ఇచ్చి వారికి అండగా ఉంటామన్నారు. గంజాయి అనేది చంద్రగిరి నియోజక వర్గంలో ఎక్కడ లేకుండా గట్టి నిగా పెట్టడంతో పాటు గంజాయిని ఎక్కడికక్కడే అరికట్టేందుకు తగు చర్యలు పోలీసులు ద్వారా తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే పూతల పట్టు మురళి మోహన్ తో జర్నలిస్టు సోదరుల సమస్యలపై పలు తపాలా చర్చించుకోవడం జరిగిందన్నారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పూతల పట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ఒక జర్నలిస్టుగా ఎమ్మెల్యేగా జర్నలిస్టు సమస్యలను క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు తెలుస్తుంది అని వారి యోగక్షేమాలను గుర్తించు పాటు తిరుపతి ప్రెస్ క్లబ్‌కు సొంత స్థలం అలాగే జర్నలిస్టు ల ఇంటి స్థలాలు ఇచ్చేందుకు సుముఖముగా ఉన్నామని తన వంతు పూర్తి సహాయ సహకారాలు జర్నలిస్టు సోదరులకు ఉంటాయని స్పష్టం చేశారు. అనంతరం టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు సోదరుల సమస్యలను పరిష్కరించడంలో మేము ముందున్నామని దీనిపై అవసరమైతే బిజెపి ఉన్నత అధికా రులతో మాట్లాడతామని చెప్పారు. ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు వారి అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ గంజాయి అనే మాట తిరుపతి జిల్లాలో వినవడనీయకుండా చేస్తామని అయితే గంజాయి గురించి జర్నలిస్టు మిత్రులకు ఎవరికైనా తెలిసిన తమకు తెలియజేయాలే తప్ప పేపర్లో తప్పుడు కథనాలు రాస్తే వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్ర హ్మణ్యం మాట్లాడుతూ జర్నలిస్టులతో తనకు 25 ఏళ్ల అనుబంధం ఉందని అన్నారు. వారికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. అనంతరం పలువురు సీనియర్ జర్నలిస్టులు వారి వారి అభిప్రాయాలను వెల్లడిం చారు. అనంతరం కళాకారుల పాటలు అందరిని ఆకట్టుకు న్నాయి. అంతకు ముందు తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శి ఆర్ మురళి, బాలు మాట్లాడుతూ తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరై విజయవంతం చేసిన జర్నలిస్టు సోదరులు వారి కుటుంబ సభ్యులకు పార్టీలకు హాజరైన పలువురు ప్రముఖులకు పెద్దలకు అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సోదరులు నూతన కమిటీ నేతలు సభ్యులు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నేతలు సభ్యులను పలువురు శాలువలు పుష్ప గుచ్చాలతో సత్కరించి అభినందించారు.

వరినారుమడి యాజమాన్యంపై అవగాహన

విశాలాంధ్ర-కోట: వరి నారుమడులలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై బుధవారం మండల వ్యవసా యశాఖ అధికారి నిరంజన్ కుమార్ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మండల పరిధిలోని కొత్తపట్నం ,సిద్దవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ఒకఎకరా ప్రధాన పొలంకి 5 సెంట్లు నారుమడి ఏర్పాటు చేసుకొని 2కజీ నత్రజనిని విత్తనం చల్లేముందు 1కేజీ విత్తనంవిత్తిన15 రోజులు ముందు మరోక 1కేజీ,1కేజీ భాస్వరం,1కేజీ పొటాష్ నిచ్చే ఎరువులు దుక్కిలో వేసుకోవాలని అలాగే జింక్ లోపాన్ని గుర్తిస్తే లీటరు నీటిలో 2గ్రాములు జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని తెలిపారు.విత్తిన 10రోజులకు కార్బోఫ్యురాన్ 3గ్ర గుళికలు సెంట్ నారుమడికి 160 గ్రాములు లేదా నారు తీయడానికి 7రోజులుముందు 160 గ్రాములు కార్బోఫ్యురాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచాలని తెలిపారు.రైతులకు సబ్సిడీలో వరి విత్తనాలు ఖచీవీ 1638,=చీ= 15048 రకాలు రైతుసేవ కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ కార్డు తీసుకువెళ్లి బయో మెట్రిక్ విధానం ద్వారా పొందవచ్చని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు. రవికుమార్,గ్రామ మత్స్య శాఖ సహాయకులు .నాగరాజు రైతులు పాల్గొన్నారు

నవభారత్ ఉల్లాస్ కార్యక్రమంపై నేడు వాలంటీర్ టీచర్లకు శిక్షణ

విశాలాంధ్ర-సత్యవేదు: సత్యవేదు మండల పరిషత్ కార్యాలయంలో నవంబర్ 7వ తేదీన గురువారం నవభారత్ ఉల్లాస్ కార్యక్రమంపై స్వచ్ఛంద వాలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు.నిరక్షరాస్యతను రూపుమా పాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నవభారత్ ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో వయసు 15 సంవత్సరాల పైబడి నిరక్షరాసులైన అందరికీ అక్షరాలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం ముందుకొచ్చిన వాలంటీర్ టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అన్నారు. వెలుగు ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్, ఎంఈఓ రవి,ఐసిడిఎస్ అధికారిని దేవకుమారి తదితరులు బృందం స్వచ్ఛంద వాలంటీర్ టీచర్లకు శిక్షణ ఇస్తారన్నారు.గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. మండలంలోని 70 మంది స్వచ్ఛంద వాలంటీర్ టీచర్లు ప్రతి ఒక్కరూ శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు. ప్రధానంగా ఉల్లాస్ కార్యక్రమంలో నిరక్షరాస్యులైన వారికి అక్షరాలు నేర్పించడంతోపాటు ఆరోగ్య సంరక్షణ,ఆర్థిక అక్షరాస్యత,వాణిజ్య నైపుణ్యాలు తదితర విభాగాలకు సంబంధించి వాలంటీర్లు అవగాహన కల్పిస్తారు అన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయము నందు బుధవారం తడ మండల గొల్లల మలువు గ్రామానికి చెందిన గోపాలరెడ్డి కి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1,38,500 చెక్కును తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి చేతుల మీదుగా గోపాలరెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వేనాటి సతీష్ రెడ్డి మాట్లాడుతూ గోపాల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అతని వైద్య నిమిత్తం ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు అందించిన ఆర్థిక సహాయానికి ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలుతెలిపారు. గత తెలుగుదేశం పరిపాలనలో దొరవారి సత్రం మండలానికి కొన్ని కోట్ల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అనారోగ్యంతో బాధపడు తున్న బాధితులకు నారా చంద్రబాబు నాయుడు అందజేసి ఉన్నారని, తెలుగుదేశం ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల ప్రభుత్వాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట తెలుగుదేశం పార్టీ నాయకులు కామిరెడ్డి అశోక్ రెడ్డి, కె.వి.రెడ్డి, రాజారెడ్డి, జనార్దన్ రెడ్డి, బుద్ధి విజయలక్ష్మి, మంజుల, సులేటి రమణయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెట్లూరు జగన్మోహన్ రెడ్డి తల్లి చిత్రపటానికి నేదురుమల్లి నివాళి

విశాలాంధ్ర-వెంకటగిరి: డక్కిలి మండలం తీర్థంపాడు గ్రామ పంచాయతీకి చెందిన వైయస్సార్సీపి నాయకులు పెట్లూరు జగన్మోహన్ రెడ్డి తల్లి పెట్లూరు విజయమ్మ ఉత్తర క్రియలు సందర్భంగా వారి నివాసానికి వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి చేరుకొని పెట్లూరు విజయమ్మ ఉత్తర క్రియలలో పాల్గొన్నారు. తొలుత పెట్లూరు విజయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. వారి వెంట డక్కిలి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికపై చిత్తూరులో సంబరాలు

విశాలాంధ్ర-చిత్తూరు: అమెరికా అధ్యక్షునిగా రెండోవ సారి డోనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడంపై హర్షాన్ని వ్యక్తం చేస్తూ సినీ నటుడు తేజ ఆధ్వర్యంలో చిత్తూరు ప్రెస్ క్లబ్ వద్ద చిత్తూరు కుర్రాడు బృందం టపాకాయలు పేల్చి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చిత్తూరు కుర్రోడు తేజ మాట్లాడుతూ డోనాల్డ్ ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే చిత్తూరు కుర్రాడు అభిమానులు చాలా సంతోష పడుతున్నారని తెలిపారు. ట్రంప్ చిత్తూరు యాసలో మాట్లాడి నట్లు డబ్బింగ్ వీడియోస్ తీయడం తను అదృష్టంగా భావిస్తున్నా నని తెలిపారు. అలాగే తనకు మొదటగా ఎస్ఆర్ కళ్యాణమం డపం చిత్రంలో అవకాశం దక్కిందని తెలియజేశారు. అలాగే దీపావళి పండుగ విడుదలైన చిత్రంలో తాను నటించడం జరిగిందన్నారు. ఈ మీడియా సమావేశంలో సినిమాటోగ్రాఫర్ రాజేష్, నవాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గోకుల్ కృష్ణ ఇంజనీరింగ్ కాలేజీలో సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాలు మేరకు సులూరుపేట లోని గోకుల్ కృష్ణ ఇంజనీరింగ్ కాలేజీలో సైబర్ క్రైమ్స్‌లో నిపుణులు ఐ.ఎల్. నరసింహ రావు ఆధ్వర్యంలో బుధవారం ఇంజనీ రింగ్ స్టూడెంట్స్‌కి అవగాహన తరగ తులు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు గురుంచి ముఖ్యంగా ఆన్లైన్ ఫ్రాడ్స్, ఓటీపీ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్ట్‌లు, లోన్ అప్స్ మరియు స్మార్ట్ ఫోన్స్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అదేవిధంగా పార్సెల్ మోసాలు, ఫేక్ వాయిస్ కాల్స్, ఫేక్ వాట్సాప్ కాల్స్, గూగుల్ సెక్యూరిటీ మీద, మెయిల్స్ మోసాలు, పాస్వర్డ్ మోసాలు, డిజిటల్ ఫుట్ ప్రింట్స్, క్రెడిట్ కార్డు మోసాలు, ఎటిఎం కార్డ్స్ మోసాలు, వాటి గురుంచి తీసుకోవల్సిన జాగ్రత్తలు మీద స్టూడెంట్స్‌కి అవగాహన కల్పించడం జరిగింది. అదే సమయంలో తిరుపతి జిల్లా పోలీస్ వాళ్ళు ఇలా స్టూడెంట్స్‌ని ఎన్నుకోవడానికి ప్రధాన కారణం, స్టూడెంట్స్ ఒక్కొక్కరు తలా పది మందికి ఈ విధమైన మోసాలు గురుంచి అవగాహన కల్పించాలి అనే ఉద్దేశంతోనే ఇలా కాలేజీ స్టూడెంట్స్ ను ఎన్నుకోవడం ద్వారా ప్రజలు ఎవ్వరు ఇలా సైబర్ మోసాలు గురికాకూడదు అనే ప్రభుత్వఆశయంను నెరవేర్చడం తిరుపతి జిల్లా ఎస్పీ ఉద్దేశం అని డి.ఎస్.పి. చెంచుబాబు విద్యార్థులని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్ సురేష్, నాయుడుపేట డి.ఎస్.పి. చెంచుబాబు, సూళ్లూరుపేట మురళీకృష్ణ, బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి చెక్కు అందజేత

విశాలాంధ్ర-రామకుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాద పూర్వకంగా మంగళగిరి లోని తన నివాసంలో కలిసిన మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ సందర్భంగా గతంలో విజయవాడలో తుపాను సృష్టించిన బీభత్సానికి తమ వంతుగా బాధితులకు సహాయం అందించాలనే ఉద్దేశంతో మండల పరిధిలో సేకరించిన విరాళాల మొత్తాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి చెక్కును రూపాయలు 17,17,175 రూపాయల చెక్కును పార్టీ నాయకులు ముఖ్యమంత్రికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, ఎంఎల్సి కంచర్ల శ్రీకాంత్, డాక్టర్ సురేష్ బాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, చిన్నికృష్ణ, చలపతి, మహమ్మద్ రఫీ, రామ్మూర్తి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'మీకు తెలుసా' అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: మండలంలోని తోట హరిజనవాడలో ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యులందరితో సీసీ చంద్రకళ ఆధ్వర్యంలో కోర్ సంస్థ ఎన్జీవో వాళ్ళు మీకు తెలుసా హెచ్ఐవి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కోర్ సంస్థ ప్రతినిధి తులసి మాట్లాడుతూ హెచ్ఐవి టెస్టింగ్, నివారణ, గోప్యత ఏఆర్టీ మెడిసిన్‌ల గురించి నువ్వు వివరించారు. ఎంపిహెచ్ఓ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి లక్షణాలు గురించి అలాగే 18 నుండి 60 సంవత్సరాల లోపు ఉన్న వారందరూ హెచ్ఐవి పరీక్ష చేయించుకొని వారి హెచ్ఐవి స్థితిగతి తెలుసుకోవాలని సూచించారు. కోర్ సంస్థ ప్రతినిధి విజయలక్ష్మి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, ఎస్‌టిఐల గురించి వివరించారు. అనంతరం ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులందరితో కలిసి ర్యాలీ రూపంలో గ్రామమంతా తిరిగి హెచ్ఐవి పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీ చంద్రకళ ఎంపిహెచ్ఓ నరసింహ ప్రసాద్ కోర్ సంస్థ ప్రతినిధులు తులసి, విజయలక్ష్మి, అంగన్వాడి ఉపాధ్యాయులు, సంఘమిత్ర సంపూర్ణ, ఆశా కార్యకర్త అనురాధ, ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త పాడె మోసిన పూతలపట్టు ఎమ్మెల్యే

విశాలాంధ్ర-చిత్తూరు: యాదమరి మండలం, కాశిరాళ్ళ గ్రామానికి చెందిన టిటిడి కార్యకర్త మునిరత్నం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ బుధవారం మధ్యాహ్నం కాశిరాళ్ళ గ్రామానికి చేరుకుని టిడిపి కార్యకర్త మునిరత్నం మృతదేహాన్ని పూలమాల వేసి నివాళ్ళు అర్పించి భాధిత కటుంబాన్ని పరామర్శించారు. అనంతరం టిడిపి కార్యకర్త మునిరత్నం మృతదేహంపై తెలుగుదేశం పార్టీ జెండా కప్పి అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. టిడిపి కార్యకర్త మునిరత్నం మృతిపై స్థానిక శాసనసభ్యులు మురళీమోహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భాధిత కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే శక్తి భగవంతుడు ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. మునిరత్నం పార్టీకి చేసిన చేసిన సేవలు మరిచి పోలేనివని గుర్తు చేసుకున్న ఆయన, భాధిత కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదమరి మండల పార్టీ అధ్యక్షులు మురార్జీ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ శ్రీకాళహస్తి పట్టణ కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా చైతు, శివలు నియామకం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ ఎఫ్) శ్రీకాళహస్తి పట్టణ కమిటి ఎన్నిక కాగా, అధ్యక్ష, కార్యదర్శు లుగా చైతు, శివలు ఎన్నికయ్యారు. ఏఐఎస్ఎఫ్ శ్రీకాళహస్తి పట్టణ మహాసభను విక్రమ్ డిగ్రీ కాలేజ్ నందు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి కోగిలి ముని చందు విచ్చేశారు. అనంతరం నూతన పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా చైతు, శివ లను ఎన్నుకున్నారు. అలాగే కమిటీలో రెహమాన్, హర్షవర్ధన్, చక్రి, పద్మావతి, మానస, ఉదయ్ కిరణ్, ముఖేష్, రాజేష్, ప్రసాద్, బాబి, కీర్తి, పద్మశ్రీ లను సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి ముని చందు మాట్లాడుతూ విద్యా రంగంలో నెలకొన్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ ఉంటామని, పోరాటాలకు అవసరమైతే మా ప్రాణాలు సైతం అర్పిస్తామని, విద్యార్థుల హక్కులను సాధించుకుంటామని తెలిపారు. అందరూ భాగస్వాములు అయినందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఏఐఎస్ఎఫ్ చరిత్రను వివరిస్తూ స్వర్గీయులను స్మరించుకున్నారు. సల్మాన్, భాను ప్రకాష్, చైతన్య, షాహిద్ విద్యార్థులు పాల్గొన్నారు.

లాయల్ టెక్స్టైల్ యాజమాన్యం దిష్టిబొమ్మ దగ్ధం

విశాలాంధ్ర-నాయుడు పేట: నాయుడుపేట మేనకూర్ సెజ్‌లో బుధవారం లాయల్ టెక్స్టైల్ ప్రధాన గేటుముందు మహిళా కార్మికులు లాయల్ యాజమాన్యం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. లాయల్ పరిశ్రమ కార్మికులకు చట్ట పరమైన రాయితీలు ఏమి ఇవ్వకుండా మూత చేస్తున్నా రని డిసిఎల్‌కి ఏసిఎల్‌కి అర్జీలు ఇచ్చామని కార్మికులు తెలిపారు.మూడు నెలలులో డీసీఎల్‌లో ఏ.సి.ఎల్.లు పరిధిలో ఆరు దపాలుగా చర్చలకు పిలిచి వాయిదాలు వేస్తున్నారని ఆరోపించారు.దీంతో ఆగ్రహించిన కార్మికులు లాయర్ పరిశ్రమ ముందు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులకు, స్థానిక వామపక్ష నాయకులు తమ సంఘీభావం తెలిపారు. లాయల్ యాజమాన్యం నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తున్నారని ఎన్నిసార్లు చర్చలకు రమ్మని పిలిచిన ఆ యాజమాన్యం సంబంధిత ఎండి కానీ జీఎం కానీ వచ్చి వారి సమస్యలు పరిష్కరించకపోవడం బాధాకరమని కార్మికులన్నారు.ప్రభుత్వం అధికారులు ఇకనైనా యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మికులం కోరారు. పరమైన కోరికలు తీరేవరకు పరిశ్రమ ముందు తమ నిరసన కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు రత్నమ్మ, దీప, శివ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోజా గారూ...! వడ్డెరలు ఇపుడు గుర్తుకొచ్చారా..?

- బండా రామచంద్రయ్య

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మాజీ మంత్రి ఆర్‌కే రోజా ఓట్ల కోసం ఇపుడు రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని వడ్డెర విజయభేరి రాష్ట్ర అధ్యక్షులు బండా రామచంద్రయ్య విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో పెనుమూరు మండలం వేణుగోపాలపురానికి చెందిన భవ్యశ్రీని అత్యాచారం చేసి హత్య చేస్తే నాడు మంత్రిగా ఉన్న రోజా నోరు విప్పలేదన్నారు. నేడు మాత్రం ఏవేవో మాట్లాడుతోందన్నారు. తప్పుడు నివేదికలతో భవ్యశ్రీ కేసు నాడు మాఫీ చేశారన్నారు. తమకు జరిగిన అన్యాయం గురించి చిత్తూరు కలెక్టరుకు చెబుదామని వడ్డెరలు వెళితే 144వ సెక్షన్ విధించి... వారిని అక్కడకు రానీయకుండా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాడు రోజా నిందితుల వైపే నిలిచారని రామచంద్రయ్య ఆరోపించారు. నేడు రోజానే ముందుండి రాద్ధాంతం చేస్తోందన్నారు. ప్రజలు ఇది గమనిస్తున్నారన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి వీరిలో ఎవరూ వడ్డెరలకు జరిగిన అన్యాయం గురించి నాడు ప్రశ్నించలేదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం వడ్డెరలు వాడుకోవడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. రోజా ఇకనైనా వడ్డెర్లపై దాడులు, హత్యలు జరిగితే ముందుండి పోరాడాలని రామచంద్రయ్య కోరారు.

టీటీడీ పాలకమండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ గౌడ్‌ని సత్కరించిన వాలదాసు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమితులైన మల్లెల రాజశేఖర్ గౌడ్‌ని తిరుపతి జిల్లా టీడీపీ గౌడ బి.సి. సాధకారిత సమితి అధ్యక్షులు వాలదాసు తోయజాక్షులు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి, అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం టీటీడీ పాలకమండలి సభ్యులుగా మల్లెల రాజశేఖర్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా టీడీపీ గౌడ బి.సి. సాధకారిత సమితి అధ్యక్షులు వాలదాసు తోయజాక్షులు గౌడ్ మల్లెల రాజశేఖర్ గౌడ్‌ని కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాలదాసు తోయజాక్షులు గౌడ్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, నారా లోకేష్, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ గౌడ కులస్థులకు 2 మంత్రి పదవులు, ఆర్టీసీ చైర్మన్ పదవి, టీటీడీ పాలక మండలి సభ్యత్వం కల్పించి, మద్యం షాపులలో 10 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు ఎన్డీఏ కూటమి పెద్దలకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

ఇంటింటా నైపుణ్యం గుర్తిద్దాం

యువత భవిష్యత్తుకు పునాది వేద్దాం జిల్లా కోఆర్డినేటర్ చందు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: గ్రామీణ ప్రాంతాలలో ఉన్న యువతను ప్రోత్సహించడానికి ఇంటింటా నైపుణ్య గుర్తించి వారికి భవిష్యత్తుకు పునాది వేయడానికి సర్వే చేయాలని ఏపీ.ఎస్.ఎస్.డి.సి జిల్లా కోఆర్డినేటర్ ఎం చందు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ యువతలోని నైపుణ్యాలను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 15 నుంచి 59ఏళ్ల వయసున్న వారికి వారి ఆసక్తిని బట్టి నైపుణ్యాలు, వారివద్ద సమాచారం సేకరించాలన్నారు. ఆ తర్వాత వారి నైపుణ్యాలను పెంచడంపై దృష్టి సారిస్తారు. యువత మాత్రమే కాకుండా గృహిణులు, రైతులు, వడ్రంగి, కుమ్మరి తదితర వృత్తుల్లోని వారినీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. యువతకు అవసరమైన రంగాల్లో శిక్షణ అందిస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయుచున్న స్కిల్ వర్సిటీకి అనుబంధంగా ఉంటాయి వీటిలో శిక్షణ పొందిన యువతకు గుర్తింపు ధృవపత్రాలు అందిస్తారు, అది ఉన్నవారికి ఉద్యోగాలు ఎంపికలో ప్రాధాన్యమిస్తారన్నారు. గ్రామాల్లో ఉన్న యువతను ప్రోత్సాహి విధంగా సర్వే చేయాలని శిక్షణ కార్యక్రమంలో వారికి వెల్లడించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తొన్నాటి సుబ్రహ్మణ్యం, ఆనందబాబు, రామకృష్ణయ్య, టిఎటీలుగా సురేష్, మనోజ్ లు పాల్గొన్నారు.

ఉచిత మెగా డి.ఎస్.సి కోచింగ్ కొరకు నిర్వహించే

ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర-తిరుపతి: ఉచిత మెగా డి.ఎస్.సి కోచింగ్ కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో త్వరలో మెగా డి.ఎస్.సి నోటిఫికేషన్ రానున్న సందర్భంగా ఉచిత కోచింగ్ నిర్వహణకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహణకు సంబంధిత అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఎస్.సి, ఎస్. టి అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10 వ తేదీన ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాలు తిరుపతి నందు చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, కరకంబాడి రోడ్డు నందు గల శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల నందు నిర్వహించబడుతుందని తెలిపారు. పరీక్షా సమయం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులు జ్ఞాన భూమి వెబ్‌సైట్ నందు హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకొని పరీక్షా కేంద్రాలకు 10 గంటల లోపుగా చేరుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరములు తీసుకురాకూడదని అన్నారు. అభ్యర్థుల సౌకర్యం కొరకు రవాణా శాఖ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ గారు ఆదేశించారు. అభ్యర్థుల సౌకర్యం కొరకు ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్ 7013008498 ను సంప్రదించవచ్చన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్, త్రాగు నీరు, వైద్య తదితర సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉచిత శిక్షణ కొరకు తిరుపతి జిల్లా నుండి 539 దరఖాస్తులు ఎస్.సి, ఎస్.టి అభ్యర్థులు సమర్పించారని తెలిపారు. ఈ సమావేశం నందు జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారి చెన్నయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ, ఇతర జిల్లా అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, రవాణా శాఖ, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, తహశీల్దార్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లోభావి సెంటరులో కొత్త బోరు ఏర్పాటు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం లోభావి సెంటర్‌లో కొత్త బోరును ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని లోభావి సెంటర్ నందు గత ఎన్నికల ప్రచారంలో అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి తాగునీటి సమస్య ఉందని వారు చెప్పగా ఆయన వెంటనే స్పందించి ఎన్నికలలో గెలిచిన వెంటనే లోబావి సెంటర్ నందు కొత్త బోర్ వేపిస్తానని, అలాగే ప్రతి ఇంటికి ఉచిత తగు నీటి కొళాయిని ఏర్పాటు చేస్తానని మాట బొజ్జల సుధీర్‌రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికలలో గెలిచిన వెంటనే ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి లోభావి సెంటర్ నందు కొత్త బోర్ ను వేయించారు. బుధవారం లోబావి సెంటర్ నందు ఇచ్చిన మాట ప్రకారం 45 కొత్త ఉచిత తాగు నీటి కొళాయిలను ఏర్పాటు చేయుటకు శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు అద్దంకి కిట్టు పూజ చేసి పనులను ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం లోబాయి సెంటర్ వాసుల నీటి కష్టాలను తీర్చినందుకు ప్రజల తరఫున ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి, బొజ్జల రిషితా రెడ్డికి, పట్టణ అధ్యక్షులు జి.విజయకుమార్‌కి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు అద్దంకి కిట్టు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు అద్దంకి కిట్టు, 26వ వార్డు ఇంచార్జ్ అద్దంకి యశ్వంత్, కళ్యతూరు జయప్రకాష్, కమల్, కర్ల కుమార్ మునిసిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు లోబావి సెంటర్ ప్రజలు పాల్గొన్నారు.

నాయుడుపేటలో అవమానభారంతో యువతి ఆత్మహత్య

విశాలాంధ్ర-నాయుడు పేట: నాయుడుపేట పట్టణంలోని సప్తగిరి చెరువు కట్టపై నివాసం ఉంటూ, పట్టణంలోని ఎక్స్ట్రా మార్ట్ సూపర్ మార్కెట్ నందు పనిచేస్తున్న లక్ష్మీ ప్రియ (18) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలియజేశారు. మార్ట్ నిర్వాహకుల వేధింపుల కారణంతోనే తన కుమార్తె ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తల్లి అమరావతి బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన నాయుడుపేట పోలీసులు లక్ష్మీప్రియ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం లక్ష్మీ ప్రియా మృతదేహాన్ని ఆమె తల్లికు అప్పగించినట్లు పోలీసులు తెలియజేశారు. ప్రభుత్వ వైద్యశాలను ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయుడుపేట అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబి మాట్లాడుతూ, సప్తగిరి కట్టపై అమరావతి అనే మహిళ నివాసం ఉంటూ, తన ఇద్దరు కూతుర్లను పోషించుకునేదని తెలిపారు. బ్రతుకుదెరువు కొరకు అమరావతి అపాచీ కంపెనీ నందు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద కుమార్తె లక్ష్మీప్రియ స్థానికంగా ఉన్న ఎక్స్ట్రా మార్ట్ సూపర్ మార్కెట్ నందు బిల్లింగ్ విభాగంలో విధులు నిర్వహించేదని తెలిపారు. బిల్లింగ్‌లో 18 వేల రూపాయలు తేడా వచ్చినట్లు గుర్తించిన యాజమాన్యం ఆమె తల్లిని పిలిపించి వివరించినట్లు తెలిపారు. అమరావతి నగదును చెల్లించి తన కుమార్తెను ఇంటికి తీసుకువెళ్లింది. తనపై దొంగతనం నిందమోపారని, తనకు ఏ పాపం తెలియదని లక్ష్మీ ప్రియ ఏడుస్తూ, తీవ్రమనస్తాపంతో ఇంటి వద్దనే ఉండిపోయినది. మంగళవారం అమరావతి అపాచీ కంపెనీ నందు విధులు నిర్వహించడానికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకొని లక్ష్మీప్రియ తీవ్ర మనస్తాపంతో ఉరి వేసుకున్నట్లు మధ్యాహ్నం ఇంటికి వచ్చిన చిన్న కుమార్తె గమనించి స్థానికులకు తెలియజేసింది. మృతురాలు తల్లి ఫిర్యాదుతో లక్ష్మీ ప్రియ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సిఐ బాబి తెలియజేశారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం

విశాలాంధ్ర-తొట్టంబేడు: మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని సిఐ తిమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రభుత్వం నిర్దేశించిన రీచ్‌ల నుంచి ఇసుక తరలింపు చేపట్టవచ్చుని కేవలం ట్రాక్టర్ల ద్వారానే తరలించాలని తెలిపారు. జేసీబీలు, టిప్పర్లు, లారీలకు అనుమతి లేదన్నారు. అయితే ట్రాక్టర్ డ్రైవర్లకు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సంబంధిత వాహనాలు కండిషన్‌లో ఉండడంతో పాటు ఎప్పటికప్పుడు వాహనాలు పర్యవేక్షించుకోవాలన్నారు. మద్యం సేవించి అధిక వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు రోజుల క్రితం పెన్నలపాడు నుంచి ట్రాక్టర్లు ఓవర్ స్పీడ్ గా వస్తుండడంతో ఎదురుగా వస్తున్న ఓ రైతు భయభ్రాంతులకు గురై పక్కనే ఉన్న పంట పొలాల్లో పడిపోయారు. దీంతో పెన్నలపాడు రోడ్డు మార్గం కు చేరుకున్న సిఐ తిమ్మయ్య అక్రమార్కులకు తన స్టైల్లో సమాధానం చెప్పారు. ట్రాక్టర్ల యజమానులు కూడా డ్రైవర్లను మద్యం సేవించకుండా ఉండేలా వాహనాలను నడపాలని సూచించారు. ప్రతి బండికి ట్రాక్టర్ కు ట్రక్కుకు నెంబరు ఖచ్చితంగా ఉండాలని తెలిపారు. మంగళవారం సుమారు 15 ట్రాక్టర్లకు జరిమానా విధించామని.. రాత్రి వేళల్లో ఇసుక తరలింపు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఉల్లాస్‌పై దృష్టి సారించి 100 శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

విశాలాంధ్ర-గుడిపాల: ఉల్లాస్ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే నైట్ వాచ్‌మన్లను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారించాలని ఈ కార్యక్రమము మండలములో నవంబర్ 8 వ తేదీ నుండి మార్చి 31 వ తేదీ వరకు జరప బడుతుందని గుడిపాల మండలంనకు నిర్దేశించిన 194 మంది నిరక్షరాశులను 100 శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దవలసిందిగా గుడిపాలెం మండల ఏపీఎం సుధారాణి కోరారు, సాయంత్రం అంగన్‌వాడీ భవనాల్లో తరగతులు నిర్వహించాలని, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ నోడల్ అధికారిగా వ్యవహరించాలని తెలిపారు. మండలాల వారీగా అక్షరాస్యతా లక్ష్యాలను నిర్దేశించి, అంగన్‌వాడీ, సామాజిక భవనాలను అందుబాటులో ఉంచి శిక్షణను ఇవ్వాలని కోరారు. మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వీ.ఓ.ఏలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ద్వారా వాలంటీర్ టీచర్లను, నేర్చుకునే వారిని గుర్తించాలని చెప్పారు. వాలంటీర్ టీచర్లు, ఉల్లాస్ యాప్ ద్వారా నేర్చుకు నేవారి పేర్లను నమోదు చేయాలని తెలిపారు. ప్రతి దినం సాయంత్రం రెండు గంటల సమయం బోధన గావించి గ్రామ పరిధిని ఆయాలు, పాఠశాల కుక్ లు, నైట్ వాచ్మెన్లు ఇతర గ్రూపు సభ్యులు అందరిని ఆర్థికపరంగా డిజిటల్ పరంగా అక్షరాస్యులుగా చేయుటకు ఈ కార్యక్రమ ఉద్దేశాలను లక్ష్యాలను డిస్టిక్ నుండి విచ్చేసిన వయోజన విద్యాశాఖ సూపర్వైజర్ టి.కందేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వి.వో.ఏలు అక్షర వాలంటీర్లు మరియు మండల సీ.సీ లోకనాథ్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

ఇరువైపులా రహదారుల ఆక్రమణలపై విముక్తిచిరుతల పార్టీ నాయకులు ఆందోళన

విశాలాంధ్ర-సత్యవేడు: మండల కేంద్రమైన సత్యవేడు పట్టణంలో నెలకొన్న పలు సమస్యలపై విముక్తి చిరుతల పార్టీ నాయకులతో పాటు ఏఆర్డబ్ల్యు స్వచ్ఛంద సేవ నాయకులు పలువురు రోడ్డు ఎక్కారు. బుధవారం విముక్తి చిరుతల పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నీలవానత్తిలవు చెందిరాన్ ఆధ్వర్యంలో ఏఆర్డబ్ల్యు స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు ఆందోళనకు పూనుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యవేడు పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపుల స్థలాలను కొందరు దుకాణ దారులు ఆక్రమించుకోవడంతో వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో వాహన రాకపోకలు స్తంభించి తరచూ ట్రాఫిక్‌కు అంతరాయాలు కలుగుతున్నట్టు చెప్పారు. ఇదే గాక ఓవర్ లోడింగ్తో పలు వాహనాలు పరుగులు తీయడంతో పట్టణంలో ప్రతినిత్యం రద్దీ ఏర్పడడంతో పాటు రోడ్లు ధ్వంసం అవుతున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు.దీంతోపాటు కంకర టిప్పర్లు పోతుండడం వల్ల దుమ్ము ధూళి గాలిలో కలుస్తూ పర్యావరణానికి పెనుముప్పుగా మారింది అన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో భారీ వాహనాలు ప్రవేశించకుండా బైపాస్ హైవే రోడ్డును నిర్మించాలన్నారు. అంతకుముందు ఇక్కడ సమస్యలు తీరేవరకు ప్రజా మద్దతుతో పోరాటం చేస్తామని స్పష్టం చేస్తూ గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విముక్తి చిరుతల కక్షి నాయకులు సాంసన్, ఏఆర్డబ్ల్యు అధినేత వెంకటస్వామి మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని

రాముల వారి గుడి రూపురేఖలు మారుస్తా

చంద్రగిరి రాములవారి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర-చంద్రగిరి: అభివృద్ధికి నోచుకోని చంద్రగిరిలోని పురాతన రాములు వారి గుడి రూపురేఖలు మారుస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి లోని రాముల వారీ ఆలయాన్ని బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నాని సందర్శించారు. చంద్రగిరి అభి వృద్ధి మండలితో కలిసి ఆలయ మంతా తిరిగి నిశితంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ కోదండ రామస్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉన్నదని చెప్పారు. ఆలయం ముందు కోనేరు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దీనిపైన నివేదికలు రూపొందించి అభివృద్ధి పరచటానికి కృషి చేస్తామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే మాట్లాడి శ్రీ రాములవారి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అభివృద్ధికి నోచుకోని చంద్రగిరిలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి ముందుకు వెళ్తానని తెలియజేశారు. యాత్రికుల కోసం ఉచిత బస్సులను ఏర్పాటు చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. విజయనగర పాలకుల నాటి వైభవాన్ని రాములవారి ఆలయానికి తిరిగి చేకూర్చటానికి కృషి చేస్తామని, దాతల సహాయం కూడా ఆలయ అభివృద్ధికి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.94కోట్లు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,94,41,581 వచ్చింది. ఆలయ కార్యనిర్వహ ణాధికారి టి.బాపిరెడ్డి పర్యవేక్షణలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా పై ఆదాయంతో పాటు 85.1గ్రాముల బంగారం, 607.1 కిలోల వెండి, 145 నోట్ల విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆదాయం సెప్టెంబరు 25వ తేదీ నుంచి 42 రోజుల వ్యవధిలో వచ్చినట్లు వారు పేర్కొన్నారు.

పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జేకేసీ, జేకేసీ, కెరీర్ గైడెన్స్ వారి ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. సెట్విన్, కౌటిల్య ఇన్ స్టిట్యూట్ వారు విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో విద్యార్థులకు వివరించారు. సంసిద్ధత పద్ధతులు, అర్హతలు గురించి తెలియచేశారు. ఉద్యోగాలకు పోటీ పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను కూడా పెంచుకోవాలని వారు సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పోటీ పరీక్షలకు వినియోగించు కోవాలన్నారు. అపుడే విద్యార్థులు తాము అనుకున్నలక్ష్యం చేరుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నరసింహవర్మ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటరు డాక్టర్ సి.బాపనయ్య, జేకేసీ, కెరీర్ గైడెన్స్ సెల్ కో-ఆర్డినేటరు డాక్టర్ టి.గంగారాం, జేకేసీ ఎట్‌ఎం గిరిజ, సెట్విన్ మేనేజరు కె.మోహన్ కుమార్, కౌటిల్య ఇన్ స్టిట్యూట్ మేనేజరు ఎన్ ఎస్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరు పేట పట్టణంలోని రైల్వే గేట్ సమీపం లో గల తెలుగుదేశం పార్టీ కార్యాల యం నందు తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమం శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథులుగా సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో శాసనసభ్యులు మాట్లాడుతూ సభ్యత్వం అంటే ప్రతి కార్యకర్త యొక్క గుర్తింపుని, దాన్ని తెలుగుదేశం కార్యకర్తలం దరూ చేయించుకోవాలని తెలిపారు, దేశంలో మరే ఇతర పార్టీ కార్యకర్తలకు అండగా 5 లక్షల ప్రమాద బీమా అందించడం లేదని,అది ఒక్క తెలుగుదేశం పార్టీ దక్కుతుందని తెలిపారు. పార్టీ యొక్క బలమే కార్యకర్తలని కాబట్టి నాయకులందరూ సభ్యత్వాలను చేయిస్తూ సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపాలని తెలిపారు. పై కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి తిరుమూర్ సుధాకర్ రెడ్డి, సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్, రాష్ట్ర యువత ఉపాధ్యక్షులు పచ్చ మాధవ నాయుడు, ఏజీ కిషోర్,అలవల శ్రీనివాసులు, రాజసులోచనమ్మ, పరసారాజా, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు మరియు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు శిక్షణ

విశాలాంధ్ర-సోమల: సోమల మండలంలో బుధ వారం సోమల వీణా మీటింగ్ హాల్ నందు సోమల మండల మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మామిడి లో పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు చాలా విపులంగా జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి మరియు శాస్త్రవేత్త బాలహుస్సేన్ తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చర్చించి నా ముఖ్యంశాలు పూత నిలబడటానికి అర్కా మాంగో స్పెషల్ అనేది బెంగుళూరు వారిచే కొత్తగా కనుగొనబడిన పోషకంని ఒక లీటర్ నీటిలో 8 గ్రా.లు కలిపి పిచికారీ చేయాలి. ఆ తరువాత పూత మొదలవటానికి ముందు 13.0.45 (మల్టీ కె) 8 గ్రా.లు మరియు బోరాన్ 2 గ్రా.లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి తద్వారా పూత బాగా తయారవుతుంది. పురుగుమందులు పిచికారీ చేసినపుడు మొక్క యొక్క కాండం నుండి చిగురు వరకు తడిచేలా పిచికారీ చేయవలెను. పురుగు మందులను వాడేటప్పుడు ఒకేరకం మందును మరల మరల వాడకుండా మార్చుకుంటూ పిచికారీ చేయవలెను అని తెలిపారు. ఈ రైతులు మరియు అధికారులు పాల్గొన్నారు.

జాతర బలి హద్దుకు స్థలం కేటాయించండి

ఎమ్మెల్యే పులివర్తి నానికి విన్నవించుకున్న పట్టణ ప్రజలు

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరిలో ప్రతి ఏటా జరిగే జాతర బలి హద్దుకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే పులివర్తి నానికి పట్టణ ప్రజలు విన్నవించుకున్నారు. చంద్రగిరి పట్ట ణంలో అతి పురాతనంగా వెలిసిన శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం స్వాధీ నం చేసుకొని అభివృద్ధి చేస్తుండటం చాలా హర్షించదగ్గ విషయం అన్నారు. చంద్రగిరి పట్టణంలో మా పూర్వీకుల కాలం నుండి ఆనవాయి తీగా పట్టణ ప్రజలు అయిన మేము ఏటా గంగ జాతర ఏర్పాటు చేసుకొని గంగమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకుంటూ గంగ జాతర నిర్వహించటం ఆనవాయితీ. సాంప్రదాయకంగా మా పూర్వీకులు, బలి తిరగడానికి పట్టణం చుట్టూ బలి హద్దులను ఏర్పాటు చేసి బలి తిరుగుతున్నాము. ఈ నేపథ్యంలో బలి హద్దును శ్రీ కోదండరామస్వామి ఆలయానికి తూర్పు దిశగా ఉంటున్న ఇండ్లకు వెనకవైపు కూడా ఎప్పటి నుండో బలి హద్దు ఏర్పాటు చేయడం జరిగింది. ఆలయ అభివృద్ధి లో భాగంగా టిటిడి ఆలయం చుట్టూ ప్రహరీ గోడను ఏర్పాటు చేయటం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఆలయానికి తూర్పున పూర్వీకులు నిర్దేశించిన బలి హద్దు లేకుండా పోతున్నది. పెద్దలు దయ తలచి మా గ్రామస్తుల క్షేమం కోరి మా మనోభావాలను గుర్తించి గంగ జాతర రోజున బలి తిరగటానికి సుమారు పది అడుగుల వెడల్పుతో బలి హద్దులు వదిలి ప్రహరీ గోడ నిర్మించేలా తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి దృష్టికి తీసుకెళ్లి సహాయం చేయవలసిందిగా గ్రామస్తులు ఎమ్మెల్యే నానిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, మొక్కల కుమార్ రాజా రెడ్డి, గౌస్ బాషా, కొత్త పాటి హేమ, సక్కురి ధనంజయ రెడ్డి, హేమచంద్ర రెడ్డి, శంకర్ రెడ్డి, బండారు హేమచంద్ర రెడ్డి, కన్నయ్య నాయుడు, సునీల్ స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్ పంపిణీ సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా నెల్లేపల్లి మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, ఆపరేషన్ సర్కిల్, తిరుపతి యొక్క స్టాండింగ్ కౌన్సిల్ గా నెల్లేపల్లి మధుసూదన రెడ్డిని ప్రభుత్వం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవి తనకు అప్పజెప్పిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సదరు సంస్థ సీఎండీ కె.సంతోష రావ్‌కు, నెల్లేపల్లి మధుసూదన రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగులకు అందుబాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

డిఎస్ త్రిలోక్ కుటుంబానికి సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

విశాలాంధ్ర-కుప్పం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ కుప్పం మున్సిపల్ అభ్యర్థి, పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం కన్వీనర్ డి ఎస్ త్రిలోక్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 20 లక్షల ఆర్థిక సహాయ చెక్కును ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అందజేశారు. గతంలో తెలుగుదేశం పార్టీ తరపున త్రిలోక్ చికిత్స కొరకు 10 లక్షలు స్వయంగా నారా చంద్రబాబు నాయుడు అందించారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. త్రిలోక్ పార్టీకి చేసిన సేవలను గుర్తిస్తూ అతని ఆరోగ్యం మెరుగుపరుచుకోడానికి చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు టి వెంకటేష్, రాజేంద్ర పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరసాకు పరామర్శ

విశాలాంధ్ర-నాయుడుపేట: మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ పరసా వెంకటరత్నయ్యను బుధవారం గొట్టిప్రోలు గ్రామంలోని ఆయన నివాసంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. మాజీమంత్రి పరసారత్నం ఇటీవల అనారోగ్యంతో చెన్నైలోని అపోలో హాస్పిటల్‌లో చికిత్సలు చేయించుకుని డిశ్చార్జ్ అయి తన స్వగ్రామం అయిన గొట్టిప్రోలులోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, గొట్టిప్రోలు ఎంపీటీసీ సభ్యులు పల్లమాల రామిరెడ్డి, రవీంద్రారెడ్డి, కోటపోలూరు సుధాకర్ రెడ్డి, కే.ఈశ్వరాజు, మన్మదరావు, పిఆర్ డిఈఈ బి.రమణయ్య ఏఈ, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పరసారత్నం నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం పూర్తి ఆరోగ్యంగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వారు ఆకాంక్షించారు.

8న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-గుడిపాల: మండల సాధారణ సర్వసభ్య సమావేశం నవంబర్ నెల 8వ తేదీన మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో శివరాజన్ తెలిపారు ఈ సందర్భంగా మండల స్థాయిలో ఇప్పటివరకు జరిగిన ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకుని అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు అదేవిధంగా మండలంలోని ఎంపీటీసీలు సర్పంచులు కోఆప్షన్ సభ్యులు ప్రతి ఒక్కరు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

దుకాణాల తనిఖీ... నలుగురు బాల కార్మికులు గుర్తింపు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పాన్ ఇండియా బాల కార్మికుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అధికారులు దుకాణాలను తనిఖీ చేసి నలుగురు బాల కార్మికులను గుర్తించారు. పాన్ ఇండియా బాల కార్మికుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ అధికారులు, మండల లీగల్ సర్వీస్ అథారిటీ, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తిలోని బీపీ అగ్రహారం వీధి, ప్రాజెక్ట్ వీధి, దర్గామిట్ట, పొనగల్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, కొత్తపేట, బహదూర్ పేట వీధులలోని దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నాలుగు అడల్సెంట్ లేబర్లను గుర్తించారు. తొట్టంబేడు మండలంలోని పిచ్చాటూరు రోడ్డు చెన్నై రోడ్డు దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ తిరుపతి చిన్నలాలప్ప, శ్రీకాళహస్తి సహాయ కార్మిక అధికారి జి.రంగనాథ్, తిరుపతి సహాయ కార్మిక అధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య, ప్రగతి స్వచ్ఛంద సంస్థ, న్యాయశాఖ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ పట్టాల కేసులో...

మోసగాళ్ళకు శిక్ష పడాలి.. బాధితులకు న్యాయం జరగాలి

తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రభుత్వ సంపదను అప్పనంగా అమ్మేసి, దర్జాగా దొంగ సొమ్మును జేబులో వేసుకొని గత ఐదేళ్ళు పాపాల భైరవుని సంరక్షణలో ఉన్న దోపిడీ రాయుళ్లపై ఫిర్యాదు చేసిన బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చూడాలని, అలాగే మోసపూరితమైన కుట్రతో ప్రభుత్వ ఆస్తిని దురాక్రమించి నకిలీ పట్టాలను సృష్టించి, వాటిని అమాయకమైన ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి -డాక్టర్ యం.ఉమేష్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం బయట పడిన నకిలీ పట్టాల వ్యవహారంలో లోతైన సమగ్ర విచారణ జరపకుండా, ఆరోపణలు ఉన్న నాటి వైసిపి నాయకులను తప్పించి, తూతూమంత్రంగా విచారణ పూర్తి చేసి, శ్రీకాళహస్తి పట్టణం, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నామమాత్రంగా నమోదు చేసిన కేసును పునర్విచారణ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ పట్టాలను సృష్టించి అటు ప్రభుత్వ భూమిని, ఇటు సామాన్య ప్రజలకు మంజూరు చేసిన భూములను అధికార బలాన్ని ఉపయోగించి అమాయక ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకోవడంలో భాగస్వాములైన అధికారులపై చర్యలు తీసుకోవాలి, శ్రీకాళహస్తి పట్టణ పరిసరాలలో జరిగిన భూ కబ్జాలపై లోతైన విచారణ జరిపి దోషులను శిక్షించడానికి అవసరమైతే సిఐడి విచారణ జరపాలని ఉమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్ళ కాలంలో అనేక భూ దందాలకు పాల్పడి, రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసి, తప్పుడు పత్రాలతో అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగిన విషయాలపై ప్రత్యేక విచారణ జరపడానికి చర్యలు తీసుకుంటున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సూచనలతో రాబోయే రోజులలో అక్రమార్కుల గుట్టు రట్టు చేయడానికి ప్రభుత్వానికి సమగ్ర నివేదికను అందజేస్తానని ఉమేష్ తెలిపారు.

మండలంలో తాగునీటికి కోటి రూపాయలు నిధులు: జెడ్పీ ఛైర్మన్

విశాలాంధ్ర-వి.కోట: మండలంలో తాగునీటి సమస్య లేదని పేర్కొన్న చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ జి.శ్రీనివాసులు అవసరమైతే మండల, జెడ్పీ నిధులతో సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలో ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. మండలంలోని సమస్య లపై వివిధ అధికారులతో సమీక్షించారు. అనంతరం శాఖలవారీగా అధికారులు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలో వేరుశనగ పంట 20 శాతం మాత్రమే వచ్చిందని వ్యవసాయ శాఖ తెలిపింది. ఉద్యాన పంటలకు సబ్సిడీ తో పందిళ్లు అందజేయనున్నట్లు తెలిపిన ఉద్యాన శాఖ ఆశక్తి గల రైతులు సంప్రదించాలన్నారు. టిష్యు కల్చర్ పంటకు హెక్టార్లు కు 45 వేల సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాత్రిల్లలో ప్రభుత్వ ఆసుపత్రికి డెలివరీ కోసం వస్తున్న వారికి వైద్యులు ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని సభ దృష్టికి రాగా స్పందించిన ఛైర్మన్ ఓగు వి.కోట ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ పి ఎక్కువగా ఉందని, సిబ్బంది తక్కువగా ఉన్నారని వైద్యులు చెప్పడంతో సదుపాయాలు ఉన్నా... సిబ్బంది కరువు రానీయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్దభరినేపల్లి పంచాయతీకి ఏఎన్ఎం ను కేటాయించాలని కోరిన సర్పంచ్ శ్రీనివాసులు. ఆరోగ్య శ్రీ కింద వైద్య సదుపాయాలు అలాగే కొనసాగుతాయి వినియోగించు కోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలుపుతూ అవ్వా తాతలకు కంటి పరీక్షలు పూర్తయ్యాయని. స్కూల్ ల్లో పిల్లలకు పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. స్కూలు పిల్లలు ఆధార్‌లో పేర్లలో తప్పులను సరిదిద్దు కోడానికి పాఠశాలలోనే అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఎన్ఎస్పీ స్కాలర్ షిప్ లపై విద్యా శాఖను వివరణ కోరగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మండల విద్యా శాఖ అధికారి చంద్రశేఖర్ ప్రశ్న కు బదులు ఇవ్వలేక పోవడం గమనార్హం. జీడిఎస్ కింద 47 రోడ్లు పూర్తి అయ్యాయని. మరో ఏడు రోడ్ల పనులు జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఈజీఎస్ ద్వారా మాత్రమే సిసి రోడ్ల కు అవకాశం ఉందని ఎంపీడీఓ అన్నారు. పశు వైద్య సిబ్బంది పనితీరు పై ఎంపీపీ అసహనం. వ్యక్తం చేశారు వి.కోట, బైరెడ్డిపల్లి మండలాలలో వెటర్నరీ వైద్యులు లేక పోవడంతో ఛైర్మన్ ఆరా తీశారు. అనిమల్ హస్బెండరి ఏడి తో మాట్లాడారు. తహశీల్దార్ పార్వతి మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో గ్రామ భలు జరుగుతున్నాయని గ్రామ సభల్లో రైతులు భూ సమస్యలు పై ఇచ్చే అర్జీలు ఆన్లైన్ చేసి సిసిఎస్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మండలంలో భూ పంపిణీ ద్వారా 92 మంది లబ్ధిదారులకు 99 ఎకరాలు అందజేశామన్నారు. జగనన్న ఇంటి పట్టాలు చాలా మంది లబ్ధిదారులకు అందలేదని వాటిని అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలని తహశీల్దారు పార్వతిని వైస్ ఎంపిపి తమీం కోరగా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలో తాగునీటి సమస్య లేదని పేర్కొన్న జిల్లా పరిషత్ ఛైర్మన్ మండల నిధులతో పాటు జెడ్పీ నిధులతో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపిన ఆయన మండలానికి తాగునీటి కోసం కోటి రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంపీడీవో వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, డాక్టర్ తమీం ఖాన్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏపిఓ దినకర్ బాబు

విశాలాంధ్ర-సోమల: సోమల మండలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కరువు మండ లంగా ప్రకటించిన నేప థ్యంలో జాతీయ ఉపాధి హామీ పథకం కార్యక్రమం లో ప్రతి గ్రామంలో మరింత ఎక్కువ పనులను గుర్తించాలని, పొలంలో ఉద్యాన పంటలు వేసుకొని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పొదల కుంట వారిపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామ సభ లో దినకర్ బాబు తెలిపారు. అలాగే 18 సం.లు పూర్తి అయిన వారు కార్యాలయంలో సంప్రదించి జాబ్ కార్డు ను పొందాలని సూచించారు. రైతులు తమ తమ పొలంలో మునగ మరియు సోప్ పిట్ వేసుకొనుటకు అవకాశం ఉందని ఆయన తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏర్పేడులో అన్నదానం

విశాలాంధ్ర-ఏర్పేడు: ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డి గత ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మొదటి వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పేడు మండల కేంద్రం లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత యాదవ సంఘం ఏర్పేడు మండలం అధ్యక్షులు ఊటీ చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 200 మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మొదటగా సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

విశాలాంధ్ర
తిరుపతి, చిత్తూరు జిల్లా • గురువారం 07 నవంబరు 2024

ఎంపీ లాడ్స్, నరేగా, డిఎంఎఫ్ కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు కాబడిన పనులు, జిల్లా మినరల్ ఫండ్స్ , ఎం పి ల్యాండ్ కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసి పురోగతిలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులు, జిల్లా మినరల్ ఫండ్స్, ఎంపీ లాండ్స్ పనుల పురోగతిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, గనులు, భూగర్భ శాఖ, సి పి ఓ సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ.. జిల్లాలో జిల్లా మినరల్ ఫండ్స్, ఎంపీ లాండ్స్ పనుల పురోగతిపై సమీక్షిస్తూ ప్రారంభ దశలో ఉన్న పనులు, మిగిలిన పనులలో పురోగతి సాధించి, త్వరితగతిన పూర్తి చేసేల చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ తెలుగంగ, జి ఎన్ ఎన్ ఎస్ మదన్ గోపాల్, ఎస్ ఈ పంచాయతీ రాజ్ ఇంజ నీరింగ్ అధికారి రామ్మోహన్,డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

నేడు వి. కోటలో విద్యుత్ ఉప కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - చిత్తూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అ గురువారంవి.కోటలో .విద్యుత్ ఉప కేంద్రాన్ని వర్చువల్ గా ప్రారంభించనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ పి ట్రాన్స్ కో ద్వారా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ , రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, పలమనేరు ఎం ఎల్ ఏ ఎన్.అమరనాథరెడ్డి, ఎంఎల్‌సిలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు ఎమ్మెల్యేచే పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లోని బాలికల ఉన్నత పాఠశాల నందు బుధవారం సులూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ చేతుల మీదుగా విద్యార్థినిలకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సందర్భంగా ఉపాధ్యాయురాలు జానకి రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జన్మదిన రోజు ఎమ్మెల్యేని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రతి ఒక్కరు దయచేసి పూలమాలలు కానీ శాల వాల కాని తీసుకురాకండి అలా తీసుకురావాలి అనిపిస్తే నోటు పుస్తకాలు, పెన్నులు వం టివి తీసుకొని రండి పేద విద్యార్థులకు అందచే యవచ్చని ఎమ్మెల్యే తెలపడం అభినందనీ యమన్నారు. ఆ నోట్ పుస్తకాలను పేద విద్యార్థులకు అందజేయడం నిజంగా గొప్పదనం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, పార్థసారథి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, అలవల శ్రీనివాసులు, మాధవ నాయుడు, శ్రీధర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో బయో గ్యాస్ ప్లాంటుకు భూమి పూజ

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి తిరుమలలోని కాకులమాను తిప్ప వద్ద బుధవారం ఉదయం భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి భూమిపూజ చేశారు.2.22 ఎకరాల్లో బయో గ్యాస్ ప్లాంటును ఐఓసీఎల్ నిర్మించనుంది. 0.17 ఎకరాల్లో కంపోస్టు నిల్వ కేంద్రాన్ని నిర్మించనున్నారు. రోజుకు 40 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ బయో గ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్లాంటు నిర్మాణాన్ని రూ.12.85 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించగా రూ.7.05 కోట్లు ఐఓసీఎల్, రూ.5.80 కోట్ల నిధులను టీటీడీ సమకూర్చనుంది. ఈ ప్లాంటు నిర్మాణం పూర్తయితే మిశ్రమ వ్యర్థాల ద్వారా బయో గ్యాస్ ను ఉత్పత్తి చేసి రెండున్నర కిలో మీటర్ల దూరంలోని తరిగొండ అన్న ప్రసాద కేంద్రానికి పైపు లైన్ ద్వారా పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సిఈ సత్య నారాయణ, డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి, ఐఓసీఎల్ ఈడీ -ఎస్ హెచ్ బి.అనిల్ కుమార్, సిజిఎంలు వై.వి.రమణరావు, ఏం.ఆర్.వి.బద్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించేలా చర్యలు చేపడతాం

వడమాలపేట మండలంలో మూడున్నర ఏళ్ల బాలికపై జరిగిన అఘాయిత్యానికి ప్రభుత్వం సకాలంలో స్పందించి చర్యలు తీసుకుంది : రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి జిల్లా వడమాల పేట మండల ంలో మూడున్నర ఏళ్ల బాలిక పై జరిగిన అఘాయిత్యానికి ప్రభుత్వం సకాలంలో స్పందించి చర్యలు తీసుకున్నదనీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. నేటి బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు తిరుపతి జిల్లాలోని వడమాల పేట మండలం ఏ.ఎం పురం గ్రామంలోని ఎస్టీ కాలనీలో పర్యటించి ఆరు రోజుల క్రితం మూడున్నర ఏళ్ల పసి పాప పై జరిగిన సంఘటన గురించి మాట్లాడుతూ.. ఇటీవలే ఏ.ఎం పురం గ్రామం లోని ఎస్.టి కాలనీలో అత్యంత పాశవికంగా హత్యకు గురయిన మూడున్నర ఏళ్ల గిరిజన బాలికను అదే గిరిజన కులానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి హత్య చేశాడని, ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, పోలీసులు, వెంటనే స్పందించి నిందితుడిని పట్టుకుని, రిమాండ్ కి తరలించారని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ బాధిత కుటుంబానికి పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తూ స్వయంగా హోమ్ మినిస్టర్ ఏఎం పురం గ్రామానికి వచ్చి అందచే యడం జరిగిందని తెలిపారు. నిరుపేద గిరిజన యానాది కుటుంబానికి చెందిన వీరికి న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పెషల్ కేస్ కింద పరిగణలోనికి తీసుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయనుండడం శుభపరిణామం అని అన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులుగా ఈ రోజున ఒక బాధ్యతగా, గిరిజన కుటుంబాన్ని ఓదా ర్చాలని, వారిలో మనోధై ర్యాన్ని నింపాలని వడమాల పేట మండ లంలోని ఏఎం పురం గ్రామానికి రావడం జరిగిందని, జరిగిన సంఘటనపై బాలిక తల్లిదండ్రులను అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. బాలిక తల్లిదండ్రులు తమ పాప ను చంపిన నిందితునికి చట్టం ద్వారా శిక్షించాలని, ఇలాంటివి రాష్ట్రంలో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారని అన్నారు. మండలంలోని ఏఎం పురం ఎస్టీ కాలనీ లో ఇటీవల హత్య కు గురైన బాలిక తల్లిని బుదవారం ఎస్టీ కమిషన్ సభ్యులు పరా మర్శించారు. నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోంటుందని ధైర్యం చెప్పారు. బతుకు తెరువు కోసం ఉద్యోగ అవకాశం కల్పించాలని, తమ సొంత మండలం కేవిబి పురంలో ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టించాలని కోరింది. ఆయన స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌కు పూర్తి స్థాయిలో నివేదిక పంపి తొందరలోనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అట్లే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడి పై తొందరగా శిక్ష పడేలా చర్యలు తీసుకొంటామని చెప్పారు. స్థానికులు గ్రామానికి స్మశానం లేదని విన్నవించారు. గ్రామ పరిసరాల్లో స్థలాన్ని గుర్తించి స్మశానానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ జరీనాకు ఆదే శించారు. గ్రామం లో నెలకొన్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనిపై సమగ్ర నివేదికను కమిషన్ కు అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బి.సూర్యనారాయణ, డీఎస్పీ రవికుమార్, సిఐ, భాస్కర్ నాయక్, ఎస్. ఐ అమర్నాథ రెడ్డి, ఎంపిడిఓ శేషగిరి రావు గిరిజన సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే అనుమతులు మంజూరు చేయండి: కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనల మేరకు అన్ని సక్రమంగా ఉంటేనే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. నగరంలో అనధికారిక అపార్ట్మెంట్ల నిర్మాణం, ప్రకటన బోర్డుల రెన్యువల్, భవన నిర్మాణ ప్లాన్ అనుమతులు, తదితర అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో బుధవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో దరఖాస్తు చేసిన భవన నిర్మాణాలు, అపార్ట్మెంట్ల నిర్మాణాలకు నిర్దేశిత గడువులోగా తగిన అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. ఎటువంటి అనుమ తులు మంజూరు చేయాలన్నా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వారికే ఇవ్వాలని అన్నారు. నగరపాలక సంస్థ అనుమతులు అధికారికంగా ఉన్న అపార్ట్మెం ట్లలోని ఫ్లాట్స్‌కి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులూ కలగవనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని అధికారులకు సూచించారు. నిబంధనలకు ఉల్లంఘించి ఆక్రమణలకు పాల్పడితే తొలగించడం జరుగుతుందని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. నగరంలో ప్రకటన హోర్డింగ్స్‌కి అనుమతులు పరిశీలించి లేని వాటిని తొలగిం చాలని అన్నారు. అనుమతులు లేకుండా బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జరిమానాలు విధించాలని అన్నారు. కోర్టులో వాజ్యం ఉన్న వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనుమతులు మంజూరులో ఎటువంటి పొరపాట్లు జరిగినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ప్రజలు కూడా నగరపాలక సంస్థ తరపున అన్ని అనుమతులు ఉన్న అపార్ట్మెంట్స్, లేఔట్లలో ఫ్లాట్స్ కొనుగోలు చేస్తే, భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులూ ఉండవని కమిషనర్ ప్రజలకు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డి.సి.పి. మహాపాత్ర, ఏసిపి బాలాజి, రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఎంఆర్పీ ధరలకే మద్యం అమ్మకాలు జరపాలి - బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు నమోదు

సారా తయారీ, అమ్మకాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు: ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ తలమాల విజయశేఖర్

విశాలాంధ్ర - కార్వేటినగరం: మద్యం అమ్మకాల్లో నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, నిబంధనల మేరకే మద్యం అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ తలమాల విజయశేఖర్ హెచ్చరించారు. బుధవారం కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ నూతన ఎక్సైజ్ పాలసీలో చిత్తూరు జిల్లాలో 104 షాపులు, తిరుపతి జిల్లాలో 227 షాపులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఈ మద్యం దుఖాణాలు ఈ నెల 7వ తేదీ వరకు ప్రొవిజినల్ లైసెన్స్ నడుపుతున్నా రన్నా రు. ప్రభుత్వం నిబంధనల మేరకు ఎంఆర్పీ ధరలకే ఇద్యం విక్ర యించాలని, దుఖాణాల ఎదుట ధరల పట్టిక తప్పనిసరిగా ఉండే లా చూడాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎత్తె ట్రోల్ నెంబ రును త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం యోచి స్తోందన్నారు. బెల్ట్ షాపుల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి. ని యంత్రణకు కృషి చేస్తామని, నిబంధనలు ఉల్లంఘించి బెల్ట్ షాపు లు నిర్వహిస్తే కేసులు మోదు చేయడమే కాకుండా బెల్ట్ షాపుకు మద్యం పంపిణీ చేసిన దుఖాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. తమిళ నాడు, కర్ణాటక మద్యం ఒక్క బాటిల్ కలిగి ఉన్న వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్కు తరలిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా మిలటరీ ఉద్యోగస్తులకు ప్రభు త్వం రాయితీపై అందించే మద్యాన్ని అమ్మినట్లు తెలిసిన వెంటనే విచారణ చేపట్టి రుజువైతే కేసులు నమోదు చేస్తామ న్నారు. మిటలరీ ఉద్యోగ స్తులు ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉండా లని చెప్పారు. గుడులు, బడుల వద్ద మద్యం దుఖాలు ఏర్పాట్లు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాని, బహిరంగ ప్రాంతా ల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కల్పించినట్ల యితే రిమాండ్కు తరలించి జరిమాన విధిస్తామని హెచ్చరిం చారు. గ్రామాల్లో సారా తయారీలు, అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే యువత ఎక్సైజ్ అధికారులకు సమాచార అందించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ కమిషనర్ వెంట ఎక్సైజ్ సీ.ఐ శిరీషా దేవి,ఎస్. ఐలు శ్రావణ్ తేజ్, మోసస్, సిబ్బంది పలువురు ఉన్నారు.